ఎక్సురే ౩౬ ★ # పలుకుబడి ★ "విహారి"

ధనం, అధికారం: యివి రెండూగాని, యిందులో యే వొకటైనాగాని వుంటేనే గాని వో మనిషికి వూళ్ళోగాని, ప్రాంతంలోగాని పలుకుబడి కలగదు. దేశంలో అంతా పలుకుబడి కలగాలంటే విద్యా, బుర్రా, త్యాగం వుండాలి. ఇవి ప్రతివాడికీ అందుబాటులోవి కాదు. కాబట్టి ఆవిషయం చర్చించడం అనవసరం. ఇంక మొదటి వో నిర్ణీతమైన ప్రాంతంలో సంగతిని గురించి చూస్తే, యీ సందర్భంలో కొద్దిగానో, గొప్పగానో ప్రతివ్యక్తీ యథాశక్తి పరిశ్రమ చేస్తుంటాడని అనకతప్పదు. ధనమూ, అధికారమూ కలవారు పలుకుబడికోసం అట్టే శ్రమపడవలసిన అవసరం వుండదు. చాలావరకు అప్రయత్నంగానే వీళ్ళని పదిమందీ చుట్టుకొని తిరుగుతుంటారు.

అంటే ధనవంతుడు బలిచక్రవర్తిలా రెండు చేతులా దానం చెయ్యవలసిన అవసరంలేదు. లేని వుదారపురుషునికంటే వున్న లోభే మేలన్న మాట అనాదినుంచీ వొస్తూంది. అందుకనే ధనం అనేదివుంటేనే చాలునని చెప్పడం. యింక అధికారమా ! యీ అధికారమనేదానికి నిర్వచనం వుంది. అధికార్లంటే వుద్యోగస్తులనీ—నౌకరీ చేసేవారనీ మొరటుగా అర్థంచెయ్యడానికి వీల్లేదు. "మాష్టరీకూడా వుద్యోగమేనా" అని కాటోలు వెనకటికి భమిడిపాటివారు రాసివున్నారు. ఆవిధంగాచూస్తే యీ మాష్టరీగీష్టరీచేసేవారూ, ఆలాంటివారు మరికొందరూ వుద్యోగస్తులూ—నౌకరీ చేసేవారూను అవుతారు. అధికార్లు లేరు. వారు అధికారం చెలాయిస్తుంటారన్నమాట. యీ ప్రకారంగాచూస్తే వో లెక్చరర్‌కంటే వో సాధారణ గ్రామోద్యోగి అధికారి అనిపించుకోగలుగుతాడు.

అయితే యీ పలుకుబడివల్ల వుండే లాభాలు చూదాం ! యేళ్ళకొద్దీ వో గ్రామంలోనో, వో పట్నంలోనో నివసిస్తూ ఆత్మసంతృప్తితో కాలక్షేపంచేస్తుండే మనిషిని ఆ ప్రాంతంలో యే పదిపరసెంటుకంటె యెక్కువమంది అసలు యెరిగే వుండరు. వూళ్ళో కొట్టి కోలాహలంగా వుత్సవాలూ, విందులూ భోరుకొలుపుతుండనీ, యీ ఘటాన్ని పలకరించే మానవుడు వుండడు. చివరకి కార్డుపట్టుకొని వెళ్ళితే అరసీసా కిర్సనాయిలు కూడా లభించదు. "అయిపోయింది పో" అని కశిరి కొడతాడు అంగటివాడు. అదేవూళ్ళో రెండు మూడు నెల్లక్రితం ప్రవేశించి, అన్నీ నావేనని ప్రతివిషయంలోనూ ప్రవేశిస్తూ తిరుగుతుండేవాణ్ణి వూళ్ళో యేవిధంగానైతేనేం నూటికి తొంభై మందికి తక్కువలేకుండా యెరిగివుంటారు. యే మారుమూల్లో పిల్లి సమర్తాడినా విందుకు ఆహ్వానం: యెక్కడికెళ్ళినా కుర్చీ! వో సీసా కిర్సనాయిల్‌కు అంచనావేసి మనిషినిపంపుతే, అర్ధగాలనుకు తక్కువరాదు. పైగా "యీతూరి మరోవిధంగా అనుకోవద్దనిచెప్పు" కూడా !

పైన వుదహరించిన ధనం, అధికారం కలవాళ్ళకు మాత్రమే యీ పలుకుబడివుంటుందని ఖండితంగా చెప్పడానికి వీల్లేదు. యిలాంటి పలుకుబడి సంపాయించడానికి వేరే సూత్రాలుకూడా వున్నాయి. పై ధనమూ అధికారమూ మాత్రమే కేవలం పలుకుబడిని సంపాయించి పెట్టేవయితే నిజానికి వేయిమందికి వొకడుకూడా పలుకుబడి కలిగివుండడు. మనుష్యులలో బుద్ధి వికాసం అయ్యేకొద్దీ కార్యసాధనకు మార్గాంతరాలుకూడా అన్వేషింపబడ్డాయి. యీ సూత్రాల్నిపట్టుకొని కనీసం నాటికో అయిదుమందయినా ప్రయత్నం చేస్తూ వుంటం మనం కనుగలిగి చూస్తే కనిపెట్టవొచ్చు.

పలుకుబడీ, నలుగురితోనూ పరిచయం కలిగి, ఫలానావాడు అనిపించుగునే ప్రయత్నంలో కొంతమంది ప్రాయికంగా పప్పులో కాలుగూడా వేస్తూంటారు. అది వాళ్ళకి తెలీకుండానే జరుగుతుంటుంది. యింతేగాదు యెవరైనా పోనీలే పాపమని చెప్పడానికి ప్రయత్నంచేసినా "ననేమిరా" అంటారు. ఆయేకాగ్రతలో మనస్సును అన్యథా తిప్పడంగాని — మార్చుకోవడంగాని వాళ్ళకి నచ్చదు. అంతటి దృఢవిశ్వాసంతో పనిచేస్తుంటారు పాపం!

ధనాధికారాల్లేక వొట్టిచేతుల్తో పలుకుబడి సంపాదించేవాళ్ళు నమస్కారాలకీ, గుడ్‌మార్నింగులకీ విలువకట్టకూడదు. చూచినవాళ్ళతోనంతా అప్రయత్నంగానే నమస్కారాలూ గుడ్‌మార్నింగులూ జరుపుతుండాలి. అవతలివాడు తలగాని, చెయ్యిగాని వూపక అగౌరవంగా ప్రవర్తించినా నొచ్చుకోరాదు. తనడ్యూటీ తాను చేశాననీ యిది ప్రతిఫలరహితమైందనీ అనుకోవాలి. తీరికవున్నప్పుడంతా వీధిలో కూర్చొని వచ్చేపొయ్యే ప్రతిమనిషినీ వాళ్ళతో తనకు యేలాంటి సంబంధమూ, పనీలేకున్నా వాళ్ళ యోగక్షేమాలు విచారించాలి. తలవొంచుకోనో యెత్తుకోనో పరధ్యానంగా యెవరైనా వెళ్ళిపోతుంటే వొట్టినే పోనివ్వరాదు. పిలిచి, సలాంచేసి, సలాం చేయించుకొని "యిప్పుడు యెలా జీవనం జరుగుతూంది! క్షుద్ర వాళ్లేమైనా కాస్త చేతికి యెదిగొచ్చారా? ధాన్యం బొత్తిగా దొరకడంలేదే పాపం మీరెలా యిబ్బంది పడుతున్నారో? మీకేమో జీతం అధికమైందటే? మీసంసారానికి యెంతవొస్తేమాత్రం యేమౌతుందిలే! యీమధ్య బొత్తిగా దర్శనమేలేదే? రెండు మూడుసార్లు వో రాచకార్యంవుండి మన యింటిదగ్గరికివొచ్చా. యింట్లో లేరన్నారు" యీ లాంటిలుకింద మాటలు జరపాలి. వాళ్ళద్వారా వాళ్ళవాళ్ళ ప్రాంతంలోనో, వీధిలోనో జరిగిన—జరుగుతున్నవిషయాల్ని తెలుసుకొని, ముందుముందు రాబొయ్యేవాళ్ళతో మాట్లాడ్డానికి తగినంత సరుకును నిలవచేసుకోవాలి.

ఆహ్వానం వున్నాసరే లేకున్నాసరే తిరునాళ్లకీ—వుత్సవాలకీ—పురాణాలకీ — హరికథలకీ తప్పక వెళ్ళుతుండాలి. అక్కడ మమ్మీలాగా

కూచోక యేదైనా కార్యభారం నెత్తిన స్వయంగా వేసుకొని నలుగురికళ్ళకూ కనబడాలి. యేపనీ దొరక్కా, యెవరూ పలకరించకాపోతే సందు చేసుకొని యేదో వో సబ్జక్టుమీద వో వుపన్యాసం విసరాలి. సమయం కాచివుండి యే యిన్‌కంటాక్సరు ఆఫీసరుతోనో, యే పోలీసు యిన్స్పెక్టరుతోనో కనీసం యే కానిస్టేబులుతోనో యేదో కాస్త పరిచయం సంపాయించుకొని, అవసరమైన పనివున్నాలేకున్నా వాళ్ళతో కలెక్టరువారు యెప్పుడు దయచేస్తారనో, సూపరెంటు దొరవారు యీ ప్రాంతానికి ప్రోగ్రామం యెప్పుడేసుకున్నారనో దర్యాప్తుచేస్తూ, నలుగురూ చూస్తుండగా వారివెంట వీధివెంట అడపాదడపా తిరగాలి. అంతమాత్రం పరిచయం దొరకడంగూడా అసాధ్యమైతే, వొట్టినే ఆ అధికారితో యెంతో పరిచయం వుండేవాడిలా ఆయన బజారువెంట వెళుతూండేసమయంలో ఆయనకో రెండుగజాలు వెనగ్గానో, పక్కగానో నడుస్తూ వెళుతుండాలి. అంతే!

కీడింగురూము వగైరాలల్లో పేకాడే సమయాల్లో, అక్కడ ప్రాయికంగా ఆ కాలక్షేపసందర్భాల్లో హెచ్చుతగ్గులు పాటింపబడవు గనక ఆటలోచేరి చైచైకలిపే ప్రయత్నం చెయ్యాలి. పెద్దలు చందాలకు వెళుతుంటే దాంతో ప్రమేయం లేకున్నా వెంటవెళుతూరావాలి. రోజూ వుండే ప్రాంతంవాళ్ళు చూచేట్టుగా పేపరుచదవాలి. అంటే చదివి విషయాల్ని మననంచేసుకునే ప్రయత్నం అక్కేలేకున్నా, పెద్దగా పదిమందీ వినేలాగున అమృతాంజనం మొదలు "ప్రింటెడ్ అండ్ పబ్లిష్‌డ్ బై"వరకూ సరాశించాలి. మాట్లాడుతూ వుండే సమయాల్లో యీసంగతిలో తనకు ప్రవేశం లేదు అని యెదటివాడు కనుక్కోకుండావుండేలాగు అన్ని బ్రాంచీల్లోనూ కొంచెం కొంచెం సరకు వుంచుకొని, దానికి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా తోడు శేసి కాస్తను గంపంతగాచేసి విడుస్తుండాలి. తెలిసీ తెలీక అధింగా అబద్ధాలుజారినా, మరోసమయంలో అదే మనిషొచ్చి "యిదేంటయ్యా" అని అడిగితే "యెలాగా?" అని ముందుగా లేనిపోని అనుమానాలు పెట్టుకోరాదు. వూపిరి తిరక్కపోతే అప్పుడే "నేనలా అనేవుండను—మీరెలా విన్నారో" అని తప్పుకోవొచ్చు. "ప్రాణవిత్త మాన భంగములయందు బొంకవచ్చు" వుందిగా! భయమెందుకు?

యెవరైనా వో టెలిగ్రామో, జాబో (యింగ్లీషులోగాని తదితర మరేభాషలోగాని) తెచ్చి చదివిపెట్టమంటే, అప్పుడే వెధవచత్వారం వొచ్చిందనో, జోడులేంది కాన్రాదనో తప్పుకోవాలి సాధ్యం కాకపోతే. అప్పటికీ విడవకపోతే దాన్ని పుచ్చుకొని వొంటరిగా తగినచోటికెళ్ళి తెలుసుకొని, కావలిస్తే జవాబుకూడా వాళ్ళదగ్గరే రాయించుకొనిరావాలి, యెవరైనా యేదైనా విచిత్రంగానో, వింతగానో అనుకుంటుంటే ఆలాంటివి తనకు ఎన్నో యిదివరకే తెలిసినట్టు నిర్లక్ష్యంగా హంగుచెయ్యాలి. తగినవాడి పరిచయలాభం సులభంగా దొరికేట్టుంటే వో యిడ్లీకీ, వో అర్ధద్రాం కాఫీకీ వెనుకంజవెయ్యవద్దు. పరిచయం అయ్యాక దానికి శతగుణంగా లాగొచ్చు. అంతమాత్రం పెట్టుబడిలేకుండా యెలా యేడుస్తుంది?

కాలం యెలావుంది యెలావస్తుందో, యెందుకైనామంచిదే, వోపొడుండబ్బీ, వో కట్ట బీడీలూ, వో పేక శిగరెట్లూ, వోనవటాకు పెప్పరమెంట్లూ లేక చక్కెరగుండ్లో యెప్పుడూ పాకెట్లో వుంచాలి. వాటిని సందర్భానుసారంగా వినియోగించాలి. వీటికి చాలామంది ఆశ్రితులు సదా వుంటుంటారు. మరచిపొయ్యేు! వో మసాలా పుగాకుపట్టకూడా వుండనీ! పెప్పరమెంట్లూ, చక్కెరగుళ్ళూ మాత్రం అడంగులు చూస్తూండగా వాళ్ళకురాళ్ళ చేతుల్లోపెట్టి వాళ్ళను ఆడించాలి.

పేపరు చదివే సంగతి తెలుస్తే చాలామంది యుద్ధవార్తలూ, ధరలూ అడుగుతారు. ధరలూ యెలాచెప్పినా ఫరవాలేదుగాని, రెండోవార్తలు మాత్రం చెప్పడంలో చాలా జాగరూకత కనపరచాలి. కాలేజారెనా, దాంతో నీపనిసరి. యథార్థమని పూర్తిగా తెలీంది నోరెత్తవద్దు. లేకపోతే యుద్ధం మాత్రం జరుగుతోంది అని ముక్తాయించాలి.

యీమధ్య ప్రతిరోజూ అడంగలకు యింగ్లీషు రాకున్నా పేపరు చదివి వినిపిస్తుండే వో పెద్ద మనిషి 15 రోజులక్రితం వో పల్లెటూరి కరణం వొచ్చి ప్రశ్నిస్తుంటే సౌత్ ఆఫ్రికాలో ముమ్మరంగా యుద్ధం జరుగుతున్నదనీ, రష్యాలో వానలు మెండుకాబట్టి యుద్ధం జరగడం లేదనీ, ఇటలీలో గూడా యుద్ధం ముమ్మరంగావుందనీ, చైనావాళ్ళు బర్మాలో హెవీగా బాంబులు వేస్తున్నారనీ, బర్మాలో బర్మీసూ, చైనీసూ, జపానువాళ్ళూ వుంటున్నారనీ, అదింకా చైనీసుకు స్వాధీనం కాలేదనీ, వొట్టినే బర్మీసు అలా చెబుతుంటారనీ చెబుతుంటే విన్నా. చేప్పేదాంట్లో పొగరుబోతుతనంగానీ, యెగతాళి పంచాంగంగాని యే మాత్రమూ లేదు. రోజూ పేపరుచదివేవాడు గాబట్టి, తనకు ఆపేపర్లో అర్థమైనంత చెప్పి వుంటాడు. కాని యిలా తెలిసీ తెలీని ప్రమాదకరమైన డాపులు కొట్టేదానికంటె, తెలివిగా రేడియోలు వినేవార్నీ, పేపర్లు చదివే వార్నీ కలుసుకొని నిజాయితీ సమాచారాలు తెలుసుకొని తల్లో దూర్చినమట్టుకు యథా తథా చెప్పి మర్యాద కాపాడుకోవడం మంచిది.

యిలా పిచ్చిపేషాలు వేస్తే వొచ్చే యిన్ఫ్లూయెన్సు రాకపోగా పైగా జరగవలసినంతా జరుగుతుంది. యింకో చిన్నవిషయం; పలుకుబడికి కాస్త వైద్యం, కొంచెం సంగీతం, భూత వైద్యం, కూడా తెలిసుండాలి. యింతెందుకు? యిది తెలుసూ యిది తెలీదూ అనరాదు, కాని వాట్లల్లో కూడా వల్లదప్పి దేహశుద్ధికాకుండా చూచుకుంటూ తిరగాలి. యిలా సంపాయించిన పలుకుబడివల్ల కాలక్రమేణా కలుగబొయ్యే లాభాలు స్థాలీపులాకంగా పైన వివరింపబడే వున్నాయి.